క్లుప్తంగా

డబుల్ బెడ్రూం సర్వే చేయలేం..



జనగామ: పట్టణంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల సర్వే చేయలేమని ఆర్‌పీలు సోమవారం మున్సిపల్ మేనేజర్ రాములుకు వినతి చేశారు. సమాఖ్యలో స్త్రీనిధి, బ్యాంకు రికవరీ, వీధి విక్రయ వ్యాపారుల వివరాల సేకరణతో అనేక పనులు తదితర బాధ్యతలు తమపై ఉన్నాయన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల సర్వే తమ నుంచి కాదని, అధికారులు సహకరించాలని కోరారు.

శివాలయ అభివృద్ధికి సహకరించాలి

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెంలో కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయం అభివృద్ధికి సహాయ సహకారాలను అందించాలని సోమవారం నాయకులు జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా గ్రామంలోని శివాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సాయంతో కొంత అభివృద్ధి చేశామని మరింత అభివృద్ధికి సాయం అందించాలని కోరారు. ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్ సాదం వెంకటయ్య, ఎంపీటీసీ సాదం నర్సింహులు, నాయకులు జక్కుల రాజయ్య, పుట్ట కిరణ్‌రెడ్డి, మూడిక సాయిలు, కర్ర మల్లారెడ్డి, మారపాక ఇసాక్, ఎర్రబెల్లి చేరాలు, పోలు వెంకట్ ఉన్నారు.

బిల్లులు చెల్లించాలి

పాలకుర్తి: ఈ కుబేరులో పేరుకుపోయిన బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్మడి అశోక్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ కుబేరులో పేరుకపోయిన బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులకు సంబంధించిన నగదును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సిరిపురం యాదయ్యకు నివాళి



జనగామ రూరల్: తెలంగాణ ఉద్యమంలో పద్మశాలి ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య ఆత్మబలిదానంతోనే ఉద్యమం ఎగిసిపడిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున అన్నారు. జిల్లా పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో సిరిపురం యాదయ్య వర్ధంతిని సోమవారం జనగామ చౌరస్తాలో నిర్వహించారు. యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకొన్నారు. నాయకులు సతీస్, ఎ.కృష్ణ, రాంప్రసాద్, భూలక్ష్మి, నాగరాజు, సింహాద్రి, రాజు ఉన్నారు.

ప్రత్యేక పూజలు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని మహాదేవస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పిండిపోలు శ్రీనివాస్‌శర్మ వేదమంత్రోచ్చారణాలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసరాల్లో అధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా కీర్తిశేషులు కూరెళ్ల రంగయ్య–వెంకటమ్మ జ్ఞాపకార్థం మహాన్నదానం నిర్వహించారు. కూరెళ్ల వేదకుమార్, వినయ్‌కుమార్, పోకల పోషనాదం, బచ్చు చిరంజీవులు, సోమేశ్వర్, చింతకింది కృష్ణమూర్తి, సాయిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జనగామ రూరల్: ఏళ్ల తరబడి గ్రామాల్లో సేవలు చేస్తున్న జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు బొట్ల శ్రీనివాస్, విజేందర్, వెంకన్న, రామచంద్రం, లాజర్, రామనారాయణ, శ్యామ్, ఐలయ్య పాల్గొన్నారు.

బండా ప్రకాశ్‌ను కలిసిన నాయకులు

జనగామ రూరల్: శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్‌ను జనగామ మండల బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. గ్రామంలో విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నామని పోల్స్ ఏర్పాటు చేయాలని వారు వినతి అందజేశారు. మండల అధ్యక్షుడు యాదగిరి, వెంకటేష్, పరుశరాములు, శంకర్ ఉన్నారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి

● రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి

బచ్చన్నపేట: అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇటుకాలపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని అయన పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది కంటిచూపు మందగించి పట్టణాలకు వెళ్లి పరీక్షలు చేసుకునే స్థోమత లేక దృష్టి లోపంతోనే ఉంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కంటిచూపు సమస్యతో బాధపడొద్దని సీఎం కేసీఆర్ గ్రామాగ్రామాన కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ నాగిరెడ్డి రజిత, ఎంపీటీసీ దూడల కనుకయ్య, ఉప సర్పంచ్ బియ్య అశోక్, మండల పార్టీ అధ్యక్షులు బొడిగం చెంద్రారెడ్డి, మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



బచ్చన్నపేట: వైద్యులతో మాట్లాడుతున్న ఇర్రి రమణారెడ్డి

కుందారంలో..

లింగాలఘణపురం: కుందారంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ చాడ సుగుణ ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. డాక్టర్ కరుణాకర్‌రాజు, ఎంపీటీసీ రజిత, ఉపసర్పంచ్ ఖలీల్, వార్డు సభ్యులు వీరస్వామి, సూపర్‌వైజర్ దయామని, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, కారోబార్ యాదగిరి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సమాజ శాంతి

దేవరుప్పుల: ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతి నెలకొంటుందని ప్రముఖ వ్యాపారి బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. సోమవారం పెద్దమడూరు గ్రామం కోలుకొండలో నిర్మిస్తున్న శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయానికి ఆయన రూ.1,10,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో వివిధ సామాజిక వర్గాల పండుగలకు పూర్వ వైభవం రావడం శుభపరిణామన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్‌కు కోలుకొండ గౌడ సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కారుపోతుల అశోక్‌గౌడ్, కారుపోతుల శ్రీనివాస్, సత్తయ్య, బబ్బూరి నాగరాజు, నాయకపు శేఖర్, గౌడ సంఘం నాయకులు యామగాని నాగయ్య, ఎల్లయ్య, కన్న రవి, చీకట్ల సత్తయ్య, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న శ్రీకాంత్ గౌడ్

కనులపండువగా అన్నపూజ



పూజ చేస్తున్న భక్తులు

జనగామ: జిల్లా కేంద్రంలోని మూలబావి శ్రీ హనుమత్, రామనాథ స్వామి సహిత శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో వెలసిన శ్రీ పర్వతవర్ధినీ సమేత రామనాథ స్వామికి సోమవారం రుద్రసూక్త అన్నాభిషేకము, అన్నపూజ, విశేష అలంకరణ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ అధ్యక్షుడు గజ్జెల నర్సిరెడ్డి మాట్లాడుతూ ఆలయం మరింత అభివృద్ధికి భక్తులు ముందుకు రావాలని కోరారు. అమావాస్య శుభ సందర్భంగా అన్నాభిషేకము, అన్నపూజ నిర్వహించామని తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరారు. ఈ పూజా కార్యక్రమాల్లో గజ్జెల స్వరూప నర్సిరెడ్డి, పాశం విమలారాణి శ్రీశైలం, జక్కా జ్యోతి నర్సిరెడ్డి, ఝిలసాని నాగమణి కృష్ణమూర్తి, శ్యామల రాంబాబు, కందాడి వరలక్ష్మీ మల్లారెడ్డి, కుర్రెముల ఉమ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లులో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి రూ.30లక్షలు నిధులు మంజూరు చేశారని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, ఛాగల్లు సర్పంచ్ పోగుల సారంగపాణి అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణ కోసం గ్రామంలో సోమవారం ఆయన కొలతల పనులను పర్యవేక్షించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ కడియంకు సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పొన్న రజితరాజేష్, కారోబార్ చిరంజీవి, కోఆప్షన్ సభ్యుడు యాట వెంకటయ్య పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సారంగపాణి

వైభవంగా దుర్గామాత ఉత్సవాలు

రఘునాథపల్లి: మండలంలోని ఆంధ్రతండాలో రెండు రోజుల పాటు నిర్వహించే దుర్గామాత ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. తండావాసులు రాత్రి ఉమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా దుర్గామాత అలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. పాడిపంటలు చల్లంగా ఉండాలని మొక్కుకున్నారు. మంగళవారం దేవతకు యాటలు బలి ఇవ్వడంతో ఉత్సవాలు ముగుస్తాయని సర్పంచ్ బానోత్ బన్‌సూర్య తెలిపారు. ఉప సర్పంచ్ వీరన్న, పూజారి బాలాజీ, రాందాసు, హరిసింగ్, సినాద్రి, లింగన్న, కిషన్, హరిసింగ్, కాల్‌రాం, సక్రూ, గణేష్, కిషన్, శ్రీను, చంద్రోశేఖర్, బన్యా, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ శివారులో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైరు చోరీ చేసిన సంఘటన సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిడిగొండ శివారులో వ్యవసాయ బోర్లకు చెందిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరును అపహరించారు. ఉదయాన్నే బావుల వద్దకు వెళ్లిన రైతులు కాపర్ చోరీ అయినట్లు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రఘునాథపల్లి విద్యుత్ ఏఈ రాహుల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.వీరేందర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లకు చెందిన చింత శ్రీనివాసు (28) అనే యువకుడు ఈ నెల 19న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి శ్రీనివాసు నెల్లుట్లలో రోడ్డు దాటుతుండగా సూర్యాపేట వైపు వెళ్తున్న టాటాయేస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తాపడి వ్యక్తి..

రఘునాథపల్లి: మండలంలోని పొట్టిగుబ్బటితండా నుంచి ఎర్రగడ్డతండాకు వెళ్తున్న ఓ ఆటో అదుపుతప్పి రోడ్డు కింద బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం తెలవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పొట్టిగుబ్బటితండాకు చెందిన గుగులోత్ రమేష్ (30) ఆదివారం మధ్యాహ్నం తన ఆటోలో తండా నుంచి ఎర్రగండాతండాకు బయలు దేరాడు. మార్గమధ్యలో ఆటో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెల్లి బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్. వీరేందర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

లింగాలఘణపురం: మండలంలోని బండ్లగూడెం గ్రామానికి చెందిన ముస్కు సంపత్‌రెడ్డి సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఎస్సై ప్రవీణ్ అప్రమత్తతతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ముస్కు సంపత్‌రెడ్డి తల్లితండ్రులను పోషించడం లేదని తండ్రి సత్తిరెడ్డి జనగామ ఆర్డీఓ మధుమోహన్‌ని ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. సత్తిరెడ్డికి నెలకు రూ.5వేలు పోషణ నిమిత్తం ఇవ్వాలని సంపత్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీఓ ఉత్తర్వులను బేఖాతర్ చేయడంతో సత్తిరెడ్డి కలెక్టర్‌కు విన్నవించాడు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆర్డీఓకు ఆదేశాలు జారీ చేయడం, ఆర్డీఓ తహసీల్దార్ అంజయ్యను ఆదేశించడంతో సోమవారం బండ్లగూడెం వెళ్లి సత్తిరెడ్డిని ముందు గదిలో, సంపత్‌రెడ్డిని వెనుక గదిలో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మనస్థాపం చెందిన సంపత్‌రెడ్డి మండల కేంద్రంలోని ఎరువుల షాపులో పురుగుల మందు డబ్బా కొనుగోలు చేసుకొని తాను చనిపోతానంటూ బండ్లగూడెంలోని ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్ వెంటనే అతని ఇంటికి వెళ్లగా పురుగుల మందు తాగుతుండగా అతని వద్ద నుంచి పురుగుల మందు డబ్బాను లాగిపడేశాడు. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయం లేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

బచ్చన్నపేట: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. ప్రజాగోస-బీజేపీ భరోసాలో భాగంగా మండలంలోని ఆలింపూర్, నాగిరెడ్డిపల్లిల్లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొన్న ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంకుశపాలనపై ధ్వజమెత్తారు. జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, పార్లమెంట్ కోకన్వీనర్ కొంతం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జూకంటి గణేష్, నాయకులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: మాట్లాడుతున్న దశమంతరెడ్డి

హామీలు నెరవేర్చని ప్రభుత్వానికి గుణపాఠం చేప్పాలి

జనగామ రూరల్: ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని ధర్మకంచ ఏరియాలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి, నాయకులు రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రేమలతారెడ్డి, పవన్ శర్మ పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్

జఫర్‌గఢ్: మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతూ సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిడుగులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది ఆత్మ బలిదానలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ పాలన మూలంగా అన్ని వర్గాల ప్రజల ఆశలు గల్లంతయ్యాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ ద్వారానే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధిస్తుందన్నారు. పార్టీ జిల్లా నాయకులు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, వేల్పుల అశోక్, అంజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తాటి సురేష్‌గౌడ్, నాయకులు బుర్ర తిరుపతిగౌడ్, కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రడపాక ప్రదీప్, రవి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు

పాలకుర్తి: తెలంగాణలో కేసీఆర్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర నాయకులు లేగ రామోహ్మన్‌రెడ్డి, దుబ్బా రాజశేఖర్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, రవికుమార్, సోమేశ్వర్, సంపత్, రాణాప్రతాప్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

లింగాలఘణపురం: మండలంలోని మంథోనిగూడెంలో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు గొరిగె సంపత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరినట్లు మండల అధ్యక్షుడు సంపత్ తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, బీజేవైఎం నాయకులు దూసరి విజయ్, గణేష్, శ్రీనువాసు, కనకరాజు, ఉప్పలయ్య సత్యం, భాస్కర్, నర్సింహ్మలు, శ్రావన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండా ఎలా ఎంపిక చేస్తారు..?

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లిలో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపోలు రామ్మూర్తి ప్రశ్నించారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న 30 డబుల్‌బెడ్రూం ఇళ్లకు తహసీల్దార్ లబ్ధిదారులను ఎంపిక చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజా ప్రతినిదులు ముడుపుల కోసం బెదిరింపులకు దిగడంతో పనులు వదిలేసి వెళ్లాడన్నారు. గతంలో ఇదే స్థలాల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా 101 మందికి పట్టాలు ఇచ్చి రద్దు చేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. మనోహర్, సోమాజీ, వెంకటనర్సు, భిక్షపతి, సుమన్ పాల్గొన్నారు.

ఆట వస్తువుల పంపిణీ



జనగామ: లింగాలఘనపూర్ జెడ్పీటీసీ గుడివంశీధర్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని సోమవారం జిల్లా బీఆర్‌ఎస్ యువజన నాయకుడు షాడ బబ్లు (ఆశిష్)ఆధ్వర్యంలో పట్టణంలోని గురుకుల అనాథాశ్రమంలో చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. పిల్లల సమక్షంలో కేక్‌కట్ చేశారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మణికుమార్, ముఖ్య సలహాదారుడు భీమ్‌రాజు, వినోద్, మొయిన్, రంజిత్, ప్రవీణ్, విఘ్నేష్ ఉన్నారు.

మొక్కలను రక్షించాలి

బచ్చన్నపేట: వన నర్సరీల్లో మొక్కలను వంద శాతం రక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులు, వన నర్సరీలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో తాగు నీటికి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



కళాకారులను సన్మానిస్తున్న డీవీఆర్‌శర్మ

పాలకుర్తి టౌన్: మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణంలో ఆదివారం రాత్రి కళాకారులు ప్రదర్శించిన శ్రీభద్రాద్రి రామదాస చరితం భక్తిరస నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామచంద్రయ్యాశర్మ, ఈఓ రజనీకుమారి, సర్పంచ్ యాకంతరావు, అర్చక, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీవీఆర్‌శర్మ కళాకారులను సత్కరించారు.

‘వ్యక్తిగత విమర్శలు తగవు’

దేవరుప్పుల: తెలంగాణ సాధన పేరిట అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుపై టీపీసీసీ రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తే బీఆర్‌ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం తగదనీ కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పాదయాత్ర చేసుకోవచ్చని, పాలకుర్తిలో డిగ్రీ కళాశాల, 100 పడకల ఆస్పత్రి, ప్రతి ఊరికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏ పథకం అమలు చేసినా డెమోగా తప్ప అర్హులకు అందిన దాఖలాలు లేవన్నారు. దేవరుప్పుల మండలంలోని ప్రకృతి వనరుల కనుమరుగుపై బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మవిమర్శలు చేసుకోవాలని హితవు పలికారు. నాయకులు గండిపల్లి యాకయ్య,ఇప్ప వీరారెడ్డి, సైదులు రెడ్డి, కాసాని ఎర్రన్న, ఆకుల సోమనర్సయ్య, గుంషావళి, కాడబోయిన వెంకన్న, కొత్త రామ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజు, గణేష్, రమేష్, నాగరాజు, భాస్కర్, నరేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దేవరుప్పుల: ఉమ్మడి జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సోమవారం వరంగల్‌లోని బిర్లా ఓపెన్ స్కూల్ ఆవరణలో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మార్గం ప్రేమలత మెమోరియల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ పోటీల్లో మనీషా(10వ తరగతి), బి.హాసిని(9వ తరగతి), అక్షయ(8వ తరగతి) విజేతలుగా నిలిచారు. వీరికి రూ.12 వేల నగదుతోపాటు జ్ఞాపికలను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు, ప్రొగ్రామ్ చైర్‌పర్సన్ డాక్టర్ కె.చంద్రోశేఖర్ ఆర్యా, కోకన్వీనర్ నెల్లుట్ల రమాదేవి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.పాండుకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

జెడ్పీ చైర్మన్ రాజీనామా చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తక్షణమే తన పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడిజిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొలిపాక సతీష్ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడారు. జెడ్పీ చైర్మన్‌పై భూదందాలు, సెటిల్‌మెంట్లు తదితర అవినీతిపై గత మూడు రోజులుగా సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నా పార్టీ అధిష్టానం, అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మధు, రాకేష్, తిరుపతి, శ్రీనివాస్, వీరస్వామి ఉన్నారు.

నియామకం



స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ మహిళా అధికార ప్రతినిధిగా డివిజన్ కేంద్రానికి చెందిన నాగపురి పావనిని నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఘన్‌పూర్‌లో విలేకరులతో ఆమె మాట్లాడుతూ పదవితో తన బాధ్యత పెరిగిందని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా అహర్నిశలు కృషి చేస్తానన్నారు. పదవిలో నియమించిన ఎమ్మెల్యే రాజయ్యతో పాటు సహకరించిన నాయకులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీఐ జిల్లా కన్వీనర్‌గా మసూద్



బచ్చన్నపేట: ఆర్టీఐ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని ఆలింపూర్‌కు చెందిన ఎండి. మసూద్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు జి.ముత్తు బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మసూద్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన డాక్టర్ కూడెల్లి ప్రవీణ్‌కుమారుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీఐని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంతాపం

చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కన్నెబోయిన వెంకటయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

నివాళి

జనగామ రూరల్: బుర్రకథ పితామహుడు చిదిరాల విష్ణుమూర్తి వర్ధంతి సభను సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

శిథిలావస్థలో త్రికూటాలయం

పట్టించుకోని అధికారులు, పురావస్తుశాఖ

చిల్పూరు: మండలంలోని రాజవరంలో చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన కాకతీయుల కాలంలో నిర్మించిన త్రికూటాలయం పురావస్తుశాఖ, అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో విలువైన కట్టడం ఎందుకూ పనికిరాకుండా పోతోంది. ఒకప్పుడు భక్తులతో కిటకిటలాడేది. దూపదీప నైవేద్యాలతో వెలుగొందిన ఆలయం ప్రస్తుతం పట్టించుకునే నాథుడు లేక పిచ్చిమొక్కలు, తుమ్మలతో నిండిపోయింది. గతంలో పురావస్తు శాఖ అధికారులు వచ్చి తుమ్మలను తొలిగించి కొంత పనిని తూతూ మంత్రంగా చేసి వెళ్లిపోయారు. అనంతరం బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ గ్రామాన్ని సందర్శించినపుడు ఆలయాన్ని అభివృద్ధి చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆలయానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న త్రికూటాలయం



చరిత్రకు సాక్ష్యంగా ఉన్న మండపం

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న ఈ దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. ఆలయ అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అందిస్తాం.

\- ఎం. కిషన్‌రెడ్డి, గ్రామస్తుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



త్రికూటాలయాన్ని బాగుచేసేలా వచ్చిన అధికారులతో పాటు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అంతే కాకుండా ఆలయానికి సంబంధించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూస్తున్నాం.

\- మారేపల్లి తిరుమల, సర్పంచ్